ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
16
బుధవారం 28 మార్చి 2018
ఆంధ్రజ్యోతి Wed, 28 March 2018
epaper.andhrajyothy.com//c/27406357

# క్రీడలతో విద్యలో మరింత రాణింపు

## యూసీఈకే క్రీడా దినోత్సవంలో కరణం మల్లేశ్వరి




కరణం మల్లేశ్వరి చేతులమీదుగా ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారిణి

**జేఎన్టీయూకే, మార్చి 27:** విద్యలో రాణించాలనుకునే విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే ఇంకాబాగా రాణించగలరని భారతదేశపు మొట్టమొదటి మహిళా వెయిట్‌లిఫ్టింగ్ ఒలింపిక్ పతక విజేత కరణం మల్లేశ్వరి తెలిపారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన యూసీఈకే క్రీడాదినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఉపకులపతి ప్రొఫెసర్ వీఎస్ఎస్ కుమార్ ప్రత్యేక అతిథిగా కరణం మల్లేశ్వరి పాల్గొన్నారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ సుబ్బారావు, డైరెక్టర్ అబ్బయ్య పాల్గొనగా యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్ కుమార్ వార్షిక నివేదికను సమర్పించారు. అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ జేఎన్టీయూకేలో క్రీడా రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్యం, వృత్తిపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం కరణం మల్లేశ్వరి మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి చదువేకాకుండా ఆటపాటలను కూడా బాగుగా చేసుకోవాలని సూచించారు. ప్రతీ మనిషిలో ఏదోఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ప్రస్తుతం సాంకేతికత ముందంజ వేయడంవల్ల క్రీడారంగం కుంటుపడిందని యువత వాట్సాప్, ఫేస్‌బుక్‌కు అంకితమైపోతున్నారన్నారు. అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకొనేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. ఈసందర్భంగా వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రోగ్రాం డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడా పాలసీని ప్రవేశపెట్టాలి

## 'ఆంధ్రజ్యోతి'తో ఒలింపిక్ పతక విజేత కరణం మల్లేశ్వరి



**జేఎన్టీయూకే, మార్చి 27:** భారత దేశంలోని అన్నిరాష్ట్రాల్లో క్రీడాపాలసీని ప్రవేశపెట్టడం ద్వారా క్రీడల్లో ప్రతిభకనబరిచి దేశం తరఫున పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా వారిని ప్రోత్సహించినట్లవుతుందని ఒలింపిక్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్యపతకం సాధించిన కరణం మల్లేశ్వరి తెలిపారు. పద్మశ్రీ, అర్జున అవార్డు, రాజీవ్‌ఖేల్‌రత్న అవార్డులను పొంది నేటి యువ వెయిట్‌లిఫ్టర్లకు ఆదర్శంగా నిలిచిన కరణంమల్లేశ్వరి గూర్చి ఆమె మాటల్లో తెలుసుకుందాం.

**ప్రశ్న: ప్రస్తుతం ఏమిచేస్తున్నారు?**

**జవాబు:** హర్యానాలో వెయిట్‌లిఫ్టింగ్‌కు సంబంధించి ఇంటర్నేషనల్ కోచింగ్ అకాడమీని నిర్వహిస్తున్నాను. ప్రస్తుతం 37మందికి శిక్షణ ఇస్తున్నాం.

**ప్రశ్న: ఇప్పుడు జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో భారతదేశానికి ఎన్ని పతకాలు వచ్చే అవకాశంఉంది?**

**జవాబు:** ప్రస్తుతం నిర్వహిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో మనదేశ వెయిట్ లిఫ్టర్లు బాగా రాణిస్తున్నారు. 6నుంచి 8 పతకాలు సాధించే అవకాశం ఉంది.

**ప్రశ్న: భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం సాధించే క్రీడాకారులు ప్రస్తుతం భారతదేశంలో ఎవరైనా ఉన్నారా?**

**జవాబు:** మీరాబాయి చాను అనేవెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో పతకం సాధించే అవకాశంఉంది.

**ప్రశ్న: వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణించిన క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు ఎలాఉన్నాయి?**

**జవాబు:** ప్రభుత్వ పరంగా ఉద్యోగావకాశాలు తక్కువగా ఉన్నాయి. అయితే ఆర్మీ, రైల్వే, సీఐఎస్ఎఫ్‌లలో ఉద్యోగ అవకాశాలు పెరిగాయి.

**ప్రశ్న: ఒలింపిక్స్‌లో మీరు కాంస్య పతకం సాధించారు. స్వర్ణపతకం ఎందుకు సాధించలేకపోయారు?**

**జవాబు:** స్వర్ణం సాధించిన వెయిట్‌లిఫ్టర్‌కు నాకు కేవలం 2కిలోల బరువుమాత్రమే తేడాఉంది. ఆమె 242 కిలోల బరువుఎత్తగా నేను 240 కిలోల బరువు ఎత్తాను.

**ప్రశ్న: యువ వెయిట్‌లిఫ్టర్లకు మీరిచ్చే సలహా?**

**జవాబు:** ఎవరేమనుకుంటారు ఏదిచేస్తారు అని ఆలోచించకుండా క్రీడాకారులు స్వయంకృషితో పట్టుదలతో కష్టపడితే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చు.